# విశ్వామిత్ర!

★


రచన : శ్రీ సానుబాల రాజగోపాల్




(రచయిత)

"గాయత్రి" నాటక నాటిక పోటీలను అడ్వకేట్ బలరాం గారు నిర్వహిస్తూయుంటారు. ఆయన నాటక కళాభిమాని, కళాపోషకుడు.

పోటీలకు వచ్చిన ఎంట్రీలతో కొన్నిటిని స్క్రూటినీ పోటికి పంపిస్తారు. ప్రతీసంవత్సరం 3 మాసములు ఈ నాటకకళకి ఆయన వినియోగిస్తూ యుంటారు. ఏ మారుమూలలలోనో ఇటువంటి మహానుభావులు వుండబట్టే నాటకకళ అంతంతమాత్రంగానైనా వుంది.

అది విశాలమైన హాలు. బలరాంగారు మిత్రులతో పేకాటగాని, చదరంగాని, లేదా ఏదో పిచ్చాపాటి మాట్లాడుకొంటూ తీరికసమయంలో కాలక్షేపం చేస్తూ యుంటారు? ఆయన ముఖ్య స్నేహితులు పేరిశాస్త్రి, విద్యాసాగర్, అనంతరాములు. ఈ ముగ్గురు తరచుగా బలరాంగారితో కనబడుతూయుంటారు.

ఆరోజు బలరాంగారు - మిత్రులతో తాను స్క్రూటినీ చేసిన నాటిక నాటకాలగురించి చెప్పడం ప్రారంభించారు.

ఒరేయ్ "ఆడది" అనే నాటకం గురించి చెప్తాను. వినండి. సమాజంలో పూర్తిగా చెడిపోయి పతితగా మారిపోయిన స్త్రీని ఆదర్శ వ్యూహాలు కలిగినటువంటి యువకుడు—ఆమెని వివాహం చేసి కొని "నిజమైన స్త్రీగా" మార్చాలనుకొంటాడు. వెంటనే పేరిశాస్త్రి అందుకొన్నాడు.

ఒరేయ్ నాకు తెలియక అడుగుతున్నాను, సంఘంలో స్త్రీని ఉద్ధరించడానికి పడిపోయిన స్త్రీ తప్ప మరెవ్వరు దొరకరేమిటిరా ? ఈ కవులకి సినిమావాళ్ళకి.

నువ్వన్నది కరెక్ట్‌రా శాస్త్రీ. కాని ఏ వికలాంగో, ఏ అనాదో, ఏ అంగవైకల్యమైన స్త్రీనో చింతిగుడ్డలతో అతి దీనంగా, పేలవంగా, దరిద్రంగా చూపిస్తే నేటి ప్రజలు ఆ ప్రదర్శననిగాని, ఏ సినీమానిగాని చూడరురా.

అందుకని గుడ్డలు విప్పుకొని బరితెగించి తిరిగే స్త్రీని చూపించాలా ?

తప్పదురా. నేటి తరానికి కావలసినది అదే. ఉదాహరణకి "ఆడది" నాటకంలోని కొన్ని డైలాగులు సన్నివేశాలు చెప్తాను విను.

ఒక ధనవంతుడైన యువకుడు ఒక వేశ్య ఇంటికి వెళ్తాడు. గుమ్మం తలుపు తట్టగానే, 60 సం॥ల వయస్సు స్త్రీ వచ్చి—వారకంటితో యువకునివైపు చూచి — రా బావా, లోపలకి అంటుంది. 'బావ' అనే సంబోదన వినగానే ఆ యువకుని ఒంటిపై తేళ్ళు, జెర్రెలు ప్రాకినట్లయింది. ఆ కుర్రవాడు అయోమయంగా చూస్తాడు.

ఏంటి బావా అలాగున చూస్తున్నావు. నేను బాగోలేనా ? అంటుంది కిళ్ళీ నమిలిన గారపళ్ళతో బాడీముడి సర్దుకొంటూ.

ఛీ...ఛీ...నేను నీకు బావనా ?...నీవయస్సెంత ? నావయస్సెంత ? అంటాడు చిరాకుగా.

ఆ ... నావయస్సెంత ? ... ముప్పయ్ లోపేగా ? అంటూ సరసంగా అబ్బాయి బుగ్గపై చిటికేవేస్తుంది.

చీ...ఛీ...అని చీదరించుకొంటూ దూరం జరుగుతాడు. ఆ అబ్బాయి ఉద్దేశాన్ని పసిగట్టిన ఆవిడ—పోనీలే బావా—నేను నీకు నచ్చకపోతే, మా చెల్లెళ్ళు వున్నారు. లోపలికిరా, వాళ్ళనైనా చూద్దువుగాని.

ఆ యువకుడు లోపలికి వెళ్లాడు. ఓసేయ్—వనజా. గిరిజా, అంబికా, షీలా, శైలూ, రంబా, మేనక—రండే కొత్త బావగారు వచ్చారు. అంది నవ్వుకొంటూ.

ఆ యువకుడు—ఆమె ప్రక్క కొరకొర చూచాడు. ఏమమ్మ! ప్రభుత్వంవారు 55 సం॥ల వయస్సు వచ్చేసరికి రిటైరయిపోమంటున్నారు కదా !...మరి నీకు రిటైర్ మెంటు లేదా చిన్నారి చిలుక.

అబ్బో—అబ్బో—బావ—సరసుడే అని బుగ్గమీద ముద్దుపెట్టుకోబోయింది. అబ్బాయి పక్కకి తప్పుకొన్నాడు.

తప్పు పట్టకు బావా సరసానికి వచ్చిన సరసులందరూ—మాకు బావలు, మామలే !

ఇంతలో లోపలనుండి పదిమంది యువతులు కిలకిలమంటూ బయటికివచ్చి అతడిని చుట్టుముట్టారు. చిలిపిగా, వయ్యారంగా, విరగబడి నవ్వటం, చలోక్తులు విసరడం మొదలుపెట్టారు. కాని ఆ అబ్బాయికి ఎవ్వరూ నచ్చలేదు.

ఆ అబ్బాయి మన స్తత్వాన్ని కనిపెట్టిన ఆ వృద్ధవనిత 'ఇందూ' ఒకసారి రావే అని కేకవేస్తుంది. ఆ అమ్మాయి నవ్వుకొంటూ వచ్చి అబ్బాయిముందు నిల్చుంటుంది. అతడి ప్రక్కచూచి నవ్వుతుంది. అతడు కూడా నవ్వేస్తాడు. అబ్బాయి చెయ్యిపట్టుకొని అమ్మాయి లోపలికి తీసుకొని వెళ్తుంది. అది పడకగది. వివస్త్రలయినటువంటి శృంగార బొమ్మలతో నిండివుంది. మంచంపై యువకుని కూర్చోబెడుతుంది. ఆ అమ్మాయి వయ్యారంగా అతడిని తాకుతూ కూర్చొంటూ—ఒక్కసారికో, లేకపోతే హోల్ నైటో, అని అడుగుతుంది.

అంతే ? అర్థంకాక, అబ్బాయి అడుగుతాడు.

మరేంలేదు. ఒక్కసారికైతే 50 రూ॥లు, హోల్ నైటయితే 500 రూ॥లు...అది నా రేటు.

నేను దానిగురించి రాలేదు.

మరి దేనిగురించి.

మరేంలేదు ఇంతటి అందమైన నువ్వు—ఈ నరక కూపంలోకి ఎందుకు దిగావో తెలుసుకొందామని ?

చాలు చాలులే—ఇంతా చూస్తే—ఇదా సంబరం !—అయినా నా కథ నీకెందుకయ్యా ! నువ్వు ఏమైనా కవివా? పత్రికా విలేకరివా ?

ఆ రెండూ కాదు.

మరేమిటి ?




కావలెను

మా చేత తయారించు అత్యుత్తమమైన జంకాళాలు, బెడ్‌షీట్లకు ఆర్డరు బుక్ చేయుటకు కొత్త కమిషన్ ఏజెంట్లు కావలెను.

మీకు కావలసిన వాటికి మా అధికారం పొందియున్న ఏజెంట్ల వద్ద ఆర్డరివ్వండి.

—: Mfrs. :—

Phone : 2261

**Nandakumar Industrials**

P. B. No. 57 : : BHAVANI-638 302.

నేను ఆదర్శభావాలు కలిగిన యువకుడిని. ఒక చెడి పోయిన స్త్రీని బాగుచేయాలని కంకణం కట్టుకొన్న యువకుడిని.

చాలు, చాలు నా బేరాలన్నీ పోగొట్టేట్లున్నావు.

అలాగనకు. నువ్వు నాకు నచ్చావు. డబ్బు గురించి ఆలోచించకు ఎంత డబ్బయినా ఇస్తాను. నా తండ్రి రాజకీయ వ్యాపారంలో కోట్లు సంపాదించాడు. నాతో వచ్చేయ్. నిన్ను పెళ్ళిచేసుకొంటాను. ఆ ఇద్దరూ వివాహం చేసుకొంటారు. తండ్రితో పోట్లాడి వేరే కాపురం పెడతాడు. కొన్నాళ్లు కాపురం చేస్తారు.

"కనకపు సింహాసనమున శునకమును కూర్చుండబెట్టి''—అన్నట్లు—ఆ అమ్మాయి నగనట్ర. కేష్ పట్టుకొని చెప్పాచెయ్యకుండా మరొకడితో రాత్రికి రాత్రి లేచి పోతుంది.

మరొక నాటకం. నాటకమంతా ప్రేమమయం. రేప్ సీనులు, ట్విస్టులు. బ్రేక్ డాన్సులు, ఫైట్స్.

మూడవ నాటకం. అంతా హిప్నాటిజం—శ్మశానాలు, దెయ్యాలు. శవాలు. మనిషి పుర్రెలు ఎగరటం. శవాలు లేచి మాట్లాడడం. మంటలు, అరుపులు, కేకలు—చాలా భయంకరంగా వుంటాయి సన్నివేశాలు—ప్రేమ కోసం తపస్సు.

ఇక నాలుగవది. అంతా రాజకీయం, పదవులకోసం ప్రాకులాట, ముఠా కొట్లాటలు, హత్యలు, త్రాగుడు, వ్యభిచారం, కోర్టు సీనులు వీటితో నిండిపోయింది.

ఇవటరా నువ్వు సెలక్టుచేసిన నాటకాలు. అని అడిగాడు అనంతరాములు.

ప్రజల అభిరుచికి తగినట్లుగ సలెక్టు చేసాను. ఇంకా మరొక ఆరు నాటికలు, మూడు నాటకాలు వున్నాయి. వాటిలో "విశ్వామిత్ర" నాటకం చాలా అద్భుతంగా వుంది. ఈ సంవత్సరం ఉత్తమ నాటకంగా సెలక్టు కావచ్చును.

'విశ్వామిత్ర' పౌరాణికమా? అడిగాడు శాస్త్రి.

తొందరపడకురా? చెప్తాను.

నరసింహం ఒక కిరాయి నటుడు. పౌరాణిక, జానపద నాటకాలలో బాగా నటిస్తాడు. సాంఘిక నాటకాలు మాత్రం చాలా తక్కువ. అతడు నటించే ప్రతి నాటకం ఉత్తమ నాటకమే. ఆ నాటకంలో అతడు ఉత్తమ నటుడే. చేతిలో

''కథాంజలి'' జన్మదిన సంచికకు మా శుభాకాంక్షలు!

ఆంధ్రప్రదేశంలో అన్ని షాపులలోను దొరుకుచున్నది

గోపాల్ పళ్ళపొడి




ఒక ప్యాకెట్ వెల 0-70 పైసలు

గదగాని, కత్తిగాని, నెత్తిన కిరీటం, గడ్డంవంటివి వుంటే—నటించడానికి మంచి మూడ్‌వస్తుంది. ఏ పాత్ర ధరించినా ఆ పాత్రలో అతడు జీవిస్తాడు. నరసింహాన్ని అందరూ "సింహం'' అని టూకీగా పిలుస్తారు. నాటకాల కంట్రాక్టర్ ఎరకయ్య సింహాన్ని తన నాటకాలలో నటించడానికి కంట్రాక్టుకి తీసుకొన్నాడు. దేశమంతా తిరిగి కొన్ని లక్షలు సంపాదించాడు ఒక్క నాటకాలపైనే.

ఎరకయ్య ఎంత పెట్టుబడిదారైనాసరే—నాటకాన్ని సెలక్టుచేయడంలోగాని, నటుల్ని ఎన్నుకోవడంలోగాని, ఏ పాత్ర, ఏ సన్నివేశంలో ఎలాగున వుండాలో నిర్ణయించడం—ఆ అధికారం, హక్కులు—అన్నీ సింహానివే.

విశ్వామిత్ర నాటక రచన ఎంపిక, పాత్రదారులు ఎలాగున నటించాలో, ప్రదర్శించే తీరు. రిహార్సల్‌ని జరుగుతున్నాయి. దర్శకత్వం "సింహానిదే". కాని మేనక పాత్రకి హీరోయిన్ దొరకలేదు,

అదేమిటిరా మేనక లేకుండా విశ్వామిత్ర ఏమిటిరా?

అక్కడే వుందిరా సస్పెన్స్. మేనక వేషానికి ప్రస్తుతం డూప్‌ని పెట్టారు.

నాటకాలలో డూపేమిటిరా నీమొఖం అన్నాడు, రాములు.

ప్రస్తుతం మేనక పాత్రకి నటీమణి దొరికేవరకు ఆ పాత్ర స్థానంలో ఆడవేషాలువేసే కుర్రవాడిని పెట్టి రిహార్సల్స్ చేస్తున్నారు. ఎంతోమంది అందమైన నటీమణులు వచ్చారు నటించడానికి. కాని సింహానికి నచ్చడం లేదు.

ఇలాగయితే ఎన్నాళ్ళకి పూర్తవుతుందిరా విశ్వామిత్ర? అడిగాడు శాస్త్రి.

సింహంగారి పట్టుదల ఎరకయ్యగారికి తెలుసు. ఏమైనా ఎదురుతిరిగి మాట్లాడితే—పెట్టిన పెట్టుబడి అంతే బూడిదలో పోసిన పన్నీరవుతుంది. ఆ నాటకంపై ఎరకయ్యగారు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారు.

విశ్వామిత్రను విడుదలచేసేముందు "విందు ఏర్పాటు చేయమన్నారు. దానివలన మంచి పబ్లిసిటీ అవుతుంది, అని సింహంగారు ఎరకయ్యగారికి సలహా ఇచ్చారు.

సింహం నటించిన "విశ్వామిత్ర" నాటకాన్ని పురస్కరించుకొని—విందు ఏర్పాటుచేయడమయినది. కళాకారులు కళాపోషకులు, రచయితలు, పత్రికావిలేకర్లు, ఫోటోగ్రాఫర్లు విచ్చేయ ప్రార్థన. ఇట్లు—ఎరకయ్య. కంట్రాక్టరు. అన్న ప్రకటన పేపర్లో వెలువడింది. అని చెప్పారు బలరాంగారు.


With best compliments from :

Regd No. 6233




Phone : 21852

* కలర్ బనియన్లు, * డోరియా, * జెట్టీలు.

చాలామంది విందుకి హాజరయ్యారు. సింహంగారు ముఖ్యస్థానంలో ఆసీనులయ్యారు.

ఇంతలో ఒక మెరపుతీగ, ఒయ్యారం ఒలకబోస్తూ చిరునవ్వులు చిందిస్తూ అందరినీ ఒక్కసారి కలయజూచి, విశ్వామిత్ర పాత్రదారి అయిన సింహం ప్రక్కచూచి చిరునవ్వు నవ్వింది. అలాగున ముందుకుపోయి ఎరకయ్యగారితో కొంతసేపు మాట్లాడి లోపలికి వెళ్ళిపోయింది.

ఒక్క సింహంగారి చూపేకాదు, అచ్చట వున్నవారి అందరి దృక్కులు ఆ అప్సరసపైనే వున్నాయి.

ఎవరో అందాలరాశి? నడుస్తుంటేనే నాట్యం చేస్తున్నట్లుంది. తెలుసుకోవాలన్న కుతూహలం సింహంగారిలో కలిగింది...అంతే!

విందయిపోయింది. అందరూ వెళ్ళిపోయారు. సింహం సరాసరి ఎరకయ్యగారి దగ్గిరికి వెళ్ళారు.

ఇన్నాళ్ళకి మేనక పాత్రకి సరయినటువంటి నటీమణి దొరికింది. ఆమెను తెప్పించి, మేనకపాత్ర ఆమెచేత వేయించి నాటకాన్ని పూర్తిచేద్దాము, అని ఆనందంతో సింహం ఎరకయ్యగారిని కౌగలించుకొన్నారు. ఎరకయ్యగారు కూడా చాలా సంతోషించారు.

చెప్పండి సింహంగారు. ఎవరో అమ్మాయి. వెంటనే తెప్పించి ఈ నాటకాన్ని పూర్తిచేస్తాను.

ఎవరోకాదండి. ఇందాక విందుసమయంలో మీతో మాట్లాడిందే—ఆ అమ్మాయే! ఆ నాట్యమయూరి.

ఆ మాట వినగానే ఎరకయ్యగారికి తల తిరిగినట్లయింది. కళ్ళు బైర్లుకమ్మాయి. స్పృహతప్పి కుర్చీలోనే వుండిపోయారు.

సింహానికి ఆందోళన కలిగింది. ఏమిటి?...ఎరకయ్యగారు—ఇలాగయిపోయారని. వెంటనే ఎరకయ్యగారి మొఖంపై చల్లటినీరు చల్లారు. కొంతసేపటికి ఎరకయ్యగారికి తెలివి వచ్చింది.

ఏమిటి, ఎరకయ్యగారు—అలా స్పృహతప్పి పడిపోయారు, అని సింహం ఆతృతగా అడిగారు.

సింహంగారు! నాకు గుండె ఆగిపోయినంత పని అయింది, ఎందుచేత?

మేనక వేషం వెయ్యమని మీరు కోరినది మరెవ్వరోకాదు.

ఎవరు?

నా ప్రియురాలు, నా మూడవ భార్య—పంకజం.

అంతే!

తెర పడుతుంది.

★

With best compliments from :

# Bharath Textiles

—: Manufacturers of : —

ART SILK CARPETS, COTTON CARPETS & FAST COLOUR BEDSHEETS

P. B. No. 19, Behind Royal Theatre.

BHAVANI - 638 301.

మా ఫ్యాక్టరీలో తయారైన జంకాళాలు మరియు బెడ్‌షీట్లు చాలా ప్రసిద్ధమైనవి.

వాడిన ప్రతివారూ పదేపదే ఆర్డరిస్తున్నారు.

మా ప్రతినిధిగా వుండేవాళ్ళు మంచి లాభము పొందుతున్నారు.

ఏజెంట్లు లేని ఊళ్ళలో ఏజెంట్లు కావలెను.

(ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులోనే)